అంధకారంలో బీఆర్‌టీఎస్ రహదారులు

నిత్యం ప్రమాదాలు

గాలికొదిలేసిన వీధి దీపాల నిర్వహణ

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

చీకటి కూడళ్లు

కంచరపాలెం:

నగరంలోని 54, 55 వార్డుల పరిధిలో కంచరపాలెం నుంచి మర్రిపాలెం వరకు సాగే బీఆర్‌టీఎస్ రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోలు సాగిస్తాయి. ఈ రహదారిలోని కంచరపాలెం నేతాజీ కూడలి, ఊర్వశి జంక్షన్, ఐటీఐ కూడలి, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం జంక్షన్ ప్రాంతాల్లో గత రెండు వారాలుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చీకటి అలుముకుంటోంది.

పగటిపూట పరిస్థితి ఎలా ఉన్నా, సాయంత్రం వేళల్లో దుకాణాల వెలుగులో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి 9 గంటలు దాటితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఎదురెదురుగా వచ్చే వాహనాల లైట్లు నేరుగా కళ్లపై పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కూడళ్ల వద్ద తరచూ విద్యుత్ దీపాలు వెలగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

దీనికి తోడు, రాత్రి సమయాల్లో మతిస్థిమితం లేని వ్యక్తులు రహదారులపై అటూఇటూ తిరుగుతుండటంతో వాహనదారులు ఎక్కడ అడ్డు వస్తారోనని భయపడుతున్నారు. అంతేకాకుండా, బీఆర్‌టీఎస్ రహదారిలో గత కొంతకాలంగా నేలకూలిన విద్యుత్ స్తంభాలను తొలగించకుండా ఫుట్‌పాత్‌లపై నిర్లక్ష్యంగా వదిలేయడంతో పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. విద్యుత్ దీపాల నిర్వహణ సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడం వల్ల రహదారి చీకటిమయంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది. కొత్త విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడం, ఉన్న వాటిని సరిగా నిర్వహించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బీఆర్‌టీఎస్ రహదారిలో విరిగిన విద్యుత్ స్తంభాలను నిర్లక్ష్యంగా వదిలేసిన జీవీఎంసీ సిబ్బంది



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో చీకట్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు



ఊర్వశికూడలిలో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో కమ్ముకున్న చీకట్లు..



ఊర్వశికూడలిలో అలంకరప్రాయంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

ట్రాఫిక్ సిగ్నల్స్ నిష్ప్రయోజనం

బీఆర్‌టీఎస్ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇలాంటి కీలకమైన రహదారిపై ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోతే పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించవచ్చు. కంచరపాలెం నేతాజీ కూడలి ఫ్లైఓవర్ నుంచి మర్రిపాలెం వరకు ఉన్న ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ చాలాకాలంగా పనిచేయడం లేదు. అవి కేవలం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ పోలీసులకు వాహనాలను నియంత్రించడం కష్టతరంగా మారుతోంది. తరచూ ఈ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంటోంది.

అధికారులు స్పందించాలి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆ ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకు కొత్త లైట్లు అమర్చాలి. ఉన్న వాటిని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే, నిష్ప్రయోజనంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వెంటనే మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తేవాలి.



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో విద్యుత్ లైట్లు, స్తంభాలు

రాకపోకలకు ఇబ్బంది



బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ స్తంభాలకు లైట్లు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ లైట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అంధకార రహదారుల్లో లైట్లు వెలిగేటట్టు చర్యలు తీసుకోవాలి.

–భవ్యభారతి, తుమ్మడపాలెం, ఐటీఐ జంక్షన్.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రాత్రి సమయంలో భారీ వాహనాలు రాకపోకలతో ప్రమదాలు జరుగుతున్నాయి. అ సమయంలో విధులు ముగించుకుని ఇళ్లకు వచ్చే ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు స్పందించాలి.

–ఎ.కనకరాజు, వాహనదారుడు, ఊర్వశి జంక్షన్

క్లుప్తంగా

వ్యర్థ జలాల పునర్వినియోగంపై అవగాహన



వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నీటి భవిష్యత్తు, వ్యర్థ జలాల పునర్వినియోగం, పునర్వినియోగ పరిష్కారాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ డైరెక్టర్ వినోద్‌కుమార్ బొగ్గు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భవిష్యత్తులో నీటి వనరుల కొరత, దానిని అధిగమించడానికి అనుసరించాల్సిన పరిష్కార మార్గాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్, ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, సివిల్ విభాగం ఇన్‌ఛార్జ్ హెచ్‌వోడీ అరుణిమ మహాపాత్రో పాల్గొన్నారు. వారు వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

సీతంపేట: పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్‌లో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఏడేళ్ల బాలుడు రిషి మృతికి పూర్తి బాధ్యత విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యమే వహించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జోన్ నాయకులు అప్పలరాజు, గౌరీష్, రాజు డిమాండ్ చేశారు.

నివేదిక అందించండి

విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లోని వాటర్ వరల్డ్‌లో బాలుడు మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం స్పందించారు. ఈ ఘటనపై తక్షణమే నివేదిక అందించాలని పోలీసు, ఉన్నతాధికారులను ఆదేశించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్

దాబాగార్డెన్స్: వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్టేక్ హోల్డర్స్‌తో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే నివాస సంక్షేమ సంఘాల సభ్యులు, ఎన్జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా నగరంలో చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వారికి కూడా జీవీఎంసీ సహకారం అందిస్తుందని, వారు కోరిన మేరకు తాగునీరు అందిస్తామని చెప్పారు. వేసవిలో మధ్యాహ్నం వేళ వృద్ధులు, పిల్లలు తప్పని పరిస్థితిలో తప్ప బయటకు రావొద్దని, వదులుగా ఉన్న తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు రాజేంద్ర కృష్ణ, జోనల్ కమిషనర్లు మల్లయ్యనాయుడు, శివప్రసాద్, ఏఎంఓహెచ్‌లు డాక్టర్ సునీల్ కిషోర్, డాక్టర్ అప్పలనాయుడు, బి ప్రసాద రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి.. పూజలో పాల్గొన్న పలువురు దంపతులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమేళాకు స్పందన



ఆశీల్‌మెట్ట జోన్–3 ఆఫీస్‌లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం పోటెత్తిన దరఖాస్తుదారులు

సీతమ్మధార: ఆశీల మెట్టలోని జోన్–3 కార్యాలయం దరఖాస్తుదారులతో నిండిపోయింది. జోనల్ కమిషనర్, యూసీడీ అధికారులు, బ్యాంక్ అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు కలిసి రుణాల మంజూరుపై అవగాహన కల్పించారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు మంగళవారం నిర్వహించిన రుణ మేళా ఇంటర్వ్యూలకు మంచి స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద వివిధ యూనిట్లకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ మంజూరు కోసం 14 వార్డుల నుంచి 2,184 మంది దరఖాస్తు చేసుకున్నారు.జోన్–3 జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్ అధ్యక్షతన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 14 నుంచి 20 వార్డుల వారికి, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7 వరకు 21 నుంచి 27 వార్డుల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు 14 వార్డుల నుంచి 1,634 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రంజిత్ కుమార్, ఆర్. కోటేశ్వరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అజయ్ కుమార్, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ జయలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ఏపీడీ రాము, వార్డు కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి



సీతమ్మధార తాహసీల్దార్ కార్యాలయం వద్ద గ్యాస్ సిలెండర్లతో సీపీఐ నేతల నిరసన

సీతమ్మధార: కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిన్న ఆఘమేఘాల మీద గ్యాస్ బండపై రూ. 50లు అమాంతంగా పెంచడాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు బొట్టా ఈశ్వరమ్మ తీవ్రంగా ఖండించారు. పెంచిన గ్యాస్ ధరను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిలెండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే ఆదాయాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల నేపథ్యంలో గ్యాస్‌పై రూ. 50లు పెంచడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ధరలను అదుపు చేయడం లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం గ్యాస్ ధర పెంచినా రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దురదృష్టకరమని ఆమె అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఉచిత మూడు గ్యాస్ సిలిండర్ల పథకం చాలా మంది పేదలకు అందడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం పేదలపై భారాలు మోపితే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు యు.ఎస్.ఎ. రాజు, జి.అప్పలరాజు, మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యులు పి.వెంకటరావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు మంజూరు చేయాలి



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార: పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జీవో 30 ప్రకారం రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని, గతంలో ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మద్దిలపాలెం, కంచరపాలెం జోన్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం వద్ద కొత్త పట్టాల కోసం, గత పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్, ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, పోరంబోకు స్థలాలు, మురికివాడల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న వారికి శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివాదస్పద స్థలాల్లో ఉన్నవారికి ప్రభుత్వమే పరిష్కారం చూపాలని కోరారు. పేదలకు కనీస సదుపాయాలు కల్పించాలని వారు అన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పట్టాల గురించి చెప్పడం కాకుండా, ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఆపడం, కొత్త ప్రభుత్వం ఇస్తామని చెప్పడం మానుకోవాలన్నారు. ధర్నాకు వచ్చిన లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఎం.రమేష్ మాట్లాడుతూ, దరఖాస్తులు పరిశీలించి పట్టాలు మంజూరు చేస్తామని, ప్రభుత్వం ఆదేశాలు రాగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.కృష్ణారావు, యు.ఎస్.ఎ. రాజు, జి.అప్పలరాజు, పి.వెంకటరావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

సీతమ్మధార: విశాఖ వాసులు మండుటెండలతో అల్లాడుతుండగా, మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. రాత్రి 9.30 గంటల సమయంలో బలమైన గాలులతో వర్షం ప్రారంభమైంది. వర్షాన్ని నగరవాసులు ఆస్వాదించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) మహిళా ఎస్ఐ వి.కీర్తిరెడ్డి, జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావులు తమ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫామ్‌లలో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో చెన్నైకి చెందిన పాండియన్ ఆర్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సుమారు రూ. 26,500 విలువైన 5.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

నూకాంబిక అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న జ్ఞానేష్ తదితరులు

మర్రిపాలెం: మర్రిపాలెం: కొత్త అమావాస్య సందర్భంగా జీవీఎంసీ 53వ వార్డు ఆర్‌అండ్‌బీ జంక్షన్ సర్వీస్ రోడ్డులో కొలువైన నూకాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం ప్రచార అధ్యక్షుడు సదరం జ్ఞానేష్, పశ్చిమ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోష్న, లక్ష్మి, వెంకటేష్, సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కమిటీ



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రభాకర్

సీతంపేట: అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, కార్యదర్శిగా జేవీ ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా బత్తుల గౌతంబాబు, పతివాడ రాంబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు అతిథుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకువెళ్తామని తెలిపింది. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున, మాజీ ఐఆర్ఎస్ అధికారి జంగాలయ్య పాల్గొన్నారు.

ఆహా..ఏమి'ట్రీ' పచ్చదనం



గ్రీష్మ తాపంలోను వసంతం వెల్లివిరుస్తోంది. వేసవి కాలంలోనూ పచ్చదనం పరుచుకుంది. రైల్వే న్యూకాలనీ రోడ్డులో భారీ చెట్టుకు పచ్చని ఆకులు కమ్మేశాయి. ఎటుచూసినా పచ్చదనంతో ఆ రోడ్డు కళకళలాడుతోంది.

మండే ఎండ..పరదా చాటున



విశాఖలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచి దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండ నుంచి ఉపశమనానికి విద్యుత్ స్తంభానికి చిన్న పరదా ఏర్పర్చుకుని అమ్మకాలు సాగిస్తున్న చిరు వ్యాపారి.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రసాభాసగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

దాబాగార్డెన్స్: నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం రసాభాసగా సాగింది. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరో తెలియని పరిస్థితిలో గందరగోళంగా మారింది. కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు నూతన్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తలు విరుచుకుపడ్డారు. పార్టీకి సంబంధంలేని వ్యక్తులకు టికెట్లు ఇచ్చారని, ఇప్పుడు వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. అసలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉందా? లేదా? అనే మీమాంశలో ఉందని..అందుకు ఉదాహరణే గత కొంత కాలంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకపోవడమని ధ్వజమెత్తారు. పార్టీకి జిల్లా అధ్యక్షుడు ఎవరో? నగర అధ్యక్షుడు ఎవరో తెలియకుండా పోయిందని తన ఆవేదనను నూతన్‌కుమార్ వద్ద వెళ్లగక్కారు.

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత



డ్రోన్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి అందజేస్తున్న వరుణ్‌గ్రూపు ప్రతినిధులు

అల్లిపురం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వరుణ్ గ్రూప్ సంస్థ నగర పోలీస్ కమిషనరేట్‌కు అత్యాధునిక డ్రోన్‌ను అందజేసింది. మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని కలిసి డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల ద్వారా నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు, నేరాల నియంత్రణ, నేర పరిశోధన కూడా చేయవచ్చని కమిషనర్ అన్నారు. వీఐపీల భద్రతా ఏర్పాట్లలో నిఘా కోసం వీటిని ఉపయోగించవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని డ్రోన్లు నగర పోలీసు శాఖ వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వైజాగ్‌లో ప్రతి అడుగునా పోలీసు లేదా డ్రోన్ నిఘా ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.